

# రుద్రుడు

మధుబాబు

# రుద్రుడు

## మధుబాబు

మధుప్రియ పబ్లికేషన్స్
మాచవరం • విజయవాడ - 520 004

# RUDRUDU

(Serialised in 'Navya' weekly)

By

**MADHUBAABU**

Published by:

**MADHU PRIYA PUBLICATIONS**

Machavaram, Vijayawada - 520 004

Phone : 94411 94605

First Edition :

**2015**

Price :

**Rs. 140-00**

Cover Design :

**DURGA RAO**

Printers :

**SRI CHAITANYA OFFSET PRINTERS**

Vijayawada-2

# రుద్రుడు

"పదునెనిమిది సంవత్సరాలు నెత్తిమీదికి వచ్చేశాయి. మూడు పొద్దులా మూడు పళ్ళెరాల బువ్వ ఒక్క మెతుకు కూడా వదిలిపెట్టకుండా ఆరగించటం తప్ప అవసరానికి ఉపయోగపడే లక్షణం ఒక్కటి కూడా లేదు...."

పెద్దగొంతుతో, మాటమాటలోను తీవ్రమైన అసహ్యాన్ని కనిపింప చేస్తూ చెవులు చిల్లులు పడిపోయేలా అరవటం మొదలుపెట్టింది రుద్రుడి పిన్నమ్మ.

పెద్ద పెద్ద తాటియాకుల ఇల్లు అది. పడమటి దిశలో వుంటుంది వంట పాత్రలు కనిపించే గది.

ఒక మూలగా కూర్చుని, పొయ్యి మీది పాత్రలోని జొన్న అంబలిని తన పళ్ళెరంలోకి వంపుకుంటున్న రుద్రుడి మనస్సు చివుక్కుమన్నది ఒక్కసారిగా.

"నేను ఏం తప్పు చేశాను పిన్నీ?" చేతిలోకి తీసుకున్న అంబలి పాత్రను తిరిగి పొయ్యిమీద పెట్టేస్తూ చిన్న కంఠంతో అడిగాడు.

"చూశారా? ఎదురు సమాధానాలు ఎలా ఇస్తున్నాడో? చూశారా... వాడి మొఖంలో ఎంత తల బిరుసుతనం కనిపిస్తోందో" తలను పక్కకు తిప్పి మరోసారి గయ్‌మన్నది అతని పిన్నమ్మ.

ఎంత వద్దని అనుకున్నా ఆగకుండా నీటితో నిండిపోయాయి రుద్రుడి కళ్ళు.

వేగుచుక్క వెలుపలికి రాకముందే చిమ్మచీకట్లో ముళ్ళపొదలకు అడ్డంపడి తూర్పుదిక్కున తమకున్న పొలం దగ్గరికి పోయాడతను ఆ రోజు ఉదయం.

సరిగ్గా అప్పుడే పొలంలో ఏపుగా ఎదిగి వున్న జొన్నపంటను నాశనం చేయటానికి గుంపులు గుంపులుగా వస్తున్నాయి అడవి పందులు. చూస్తూ నిలబడితే చేతికి రాబోతున్న పంట కాస్తా చిటికెలో సర్వనాశనం అయిపోతుందని అర్ధం అయింది అతనికి. తన చేతిలో వున్న ఆరు మూరల బాణాకర్రను గిరగిరా తిప్పుతూ, గొంతు చినిగిపోయేలా పెద్దగా అరుస్తూ ఆ గుంపులకు ఎదురు వెళ్ళాడతను.

ఆకలి మీద వున్న అడవి పందులకు ఎదురుగా పోవడం అంటే ఎప్పుడే చాలాకాలం గడిచిపోయిన తర్వాత రావాల్సిన మృత్యువును అప్పటి కప్పుడే తమ దగ్గరకి రమ్మని పిలవటం వంటిదని అంటూ వుంటారు అతని గ్రామంలోని వృద్ధులు.

"సింహాలు పెద్దపులులు కూడా బెదిరి దూరంగా పారిపోతాయిరా రుద్రుడూ వాటిని చూస్తే... మహా ప్రమాదం వాటిని ఎదిరించటం" తమ తాటియాకుల ఇంటికి వంద మూరల దూరంలో నివసించే ముసలి తాత తనకు చెప్పిన జాగ్రత్తలు ఖంగుఖంగుమంటూ ప్రతిధ్వనించాయి అతని చెవుల్లో.

'వద్దురా రుద్రుడు – ముందుకు వెళ్ళవద్దురా... వెనుతిరిగి నీ పాదాలకు బుద్ధి చెప్పటం చాలామంచిదిరా' అంటూ హెచ్చరించటం మొదలు పెట్టింది అతని అంతరాత్మ కూడా.

అయినా సరే ఆగలేదతను. "ఆరుగాలం శ్రమించాము నేను మా బాబయ్యా... మా చెమటనంతా ధారపోసి పెంచుకున్నాము ఈ మొక్కల్ని... అడవిలో ఆ చెట్టు కిందా ఈ చెట్టుకిందా నేలను తవ్వి ముక్కిపోయిన దుంపలతో

కడుపులు నింపుకునే మీకు మా చేనే కావాల్సి వచ్చిందా? తిరగండి వెనక్కి" అంటూ వెనకా ముందు చూసుకోకుండా ఎదిరించాడు ఆ సూకరాల గుంపుల్ని.

బాణాకర్ర మొదటి దెబ్బ ఆదివరాహం మాదిరి నాలుగు మూరల ఎత్తున్న మొట్టమొదటి ప్రాణి ముట్టె మీద పడింది.

ఫట్‌మని శబ్దం చేస్తూ విరిగిపోయింది జానెడు పొడవున్న దాని కోరల్లో ఒకటి... ముట్టె పగిలి ఎర్రటి రక్తం వెల్లువలా బయటికి రావటం మొదలైంది.

గుండెలు జలదరించేటట్లు కీచుధ్వనులు వెలువరిస్తూ పక్కకు దూకింది అది.

వదిలిపెట్టలేదు రుద్రుడు... "పొండి... వెళ్ళి పొండి... మా చేనును వదిలి మీ దారిన మీరు వెళ్ళిపొండి" అని మరింత బిగ్గరిగా అరుస్తూ ఇంకో దెబ్బ వేశాడు ఈసారి దాని నడుము మీద.

బాధను భరించటం అసాధ్యమైపోయింది కాబోలు ఇంకా పెద్దగా శబ్దం చేసింది అది. అమాంతం గాలిలోకి ఎగిరి అతని గుండెల్ని తలతో కుమ్మటానికి ప్రయత్నం చేసింది.

నిర్మోహమాటంగా తన కర్రను విసిరాడు రుద్రుడు... అంత ఎత్తు అంత లావు వున్న ఆ అడవి మృగాన్ని ఆరు అంగల దూరంలో పడిపోయేటట్లు బలంగా బాదాడు.

చెవులు చిల్లులు పడిపోయేటట్లు మూలగటమే కాదు, ఆకాశం బ్రద్దలై పోయినట్లు దారుణమైన శబ్దాలు చేస్తూ క్రింది నించి లేచి, శరవేగంతో అడవి వైపుకు పరిగెత్తింది ఆ వరాహం.

వెంటనే మరో జీవం మీదికి పోబోతున్న రుద్రుడిని వెనుక నుంచి పట్టు కున్నాయి రెండు చేతులు.

"మనిషికి పౌరుషం అనేది అవసరమే... కాని గుడ్డి ఎద్దు చేలో పడి పరుగులు తీసినట్లు అయినదానికి కానిదానికి అవేశపడకూడదు" మూడు అడుగుల దూరంలో వున్న ఒక ఎత్తయిన బండరాయి మీదికి అతన్ని నెడుతూ మందలించాడు మదనుడు.

మందలించటంతో ఆగలేదతను. తను కూడా ఆ బండరాయి మీదికి ఎక్కి నిలుచున్నాడు.

ఎనిమిది మూరల ఎత్తున ఏపుగా ఎదిగి వున్న ఆ జొన్న చేనును మొదలు కంటా తవ్వి సర్వనాశనం చేయటానికి వచ్చిన ఆ వరాహాలు అన్నీ, తమకు

నాయకత్వం వహించే సూకరానికి పట్టిన గతిని గమనించి బెదిరి పోయాయి. ఒకేసారి వెనుతిరిగాయి అన్నీ. అర క్షణికంలో అవతలగా వున్న పొదల్లోకి పోయి అదృశ్యం అయినాయి.

“అదృష్టం బాగుండి మొట్టమొదటి దెబ్బని చూడగానే అవి బెదిరి పోయాయి... కోపం అధికమై అవి కక్షతీర్చుకోవటానికి ప్రయత్నం చేసి వుంటే నువ్వు ఏమైపోయేవాడివో తెలుసా?” బాణాకర్రను బిగించి పట్టుకుని ఆ క్షుద్ర జంతువులు వెళ్ళిపోయిన దిశలోకే చూస్తున్న రుద్రుడిని అడిగాడు మదనుడు.

తల తిప్పి అతనికేసి చూస్తూ చిరునవ్వు నవ్వాడు రుద్రుడు. “సరయిన సమయంలో వచ్చి నాకు ప్రాణదానం చేశావు... నీకు పూర్తిగా ఋణపడి పోయాను.” అతని భుజం మీద చెయ్యి వేస్తూ ఆర్ద్రంగా అన్నాడు.

“నీకు నాకు మధ్య ఋణాల ప్రసక్తి దేనికిరా? రాత్రి ఇంటికి పోకుండా మా మంచె మీదనే పడుకున్నాను. నీ అరుపులకి మెలకువ వచ్చింది. దగ్గర్లో వున్నాను కాబట్టి పరిగెత్తుకుంటూ రాగలిగాను. అదే ఊళ్లో ఉండి వుంటే వచ్చేవాడినా?” బండ రాతినించి క్రిందికి దిగుతూ అన్నాడు మదనుడు.

“ఏది ఏమయినా ఈ వరాహాల బెడద ఈ మధ్య చాలా ఎక్కువ అయిందిరా. పగటి సమయంలో కనిపిస్తే ఏదో ఒక విధంగా బెదరగొట్టి దూరంగా తరిమేయవచ్చు. ఏ సమయంలో మనం పరాకుగా వుంటామో తెలిసినట్లు తెల్లవారు ఝామునే చేనుమీదికి వచ్చి పడుతున్నాయి. ఎదిరిస్తే మనం దెబ్బతినటం, ఎదిరించకపోతే పంట నాశనం అయిపోవటం... ఏం చేయాలో తెలియటంలేదు...” వరాహాలు పారిపోయిన దిశలోకి చూస్తూ వాపోయాడు.

“ఇవన్నీ అడవికి ఆవలి వైపున వున్న పొదల్లో తిరుగుతూ వుంటాయి. ఇంతకుముందు ఎన్నడూ ఇటుకేసి రాలేదు. ఇప్పుడు ఎందుకు వస్తున్నాయో నాకు కూడా అర్థం కావటంలేదు” సాలోచనగా అన్నాడు రుద్రుడు.

“అక్కడ వాటికి ఏదో ఇబ్బంది కలిగే వుంటుంది. అందుకే ఇటు వస్తున్నాయి” అంటూ ఉన్నట్లుండి అతనికేసి చూశాడు మదనుడు. “పొద్దుపొద్దున్నే పరిగెత్తుకుంటూ వచ్చేశావు... చద్ధిబువ్వ తిని వచ్చావా?” అని అడిగాడు.

మెలకువ రాగానే తను పడుకున్న ప్రదేశంలో నుంచి పెరటిలోకి పోయి ముఖమార్జనం పూర్తి చేసుకున్నాడు రుద్రుడు. దండెం మీద ఆరవేసి వున్న ఒక పాత వస్త్రంతో ముఖం తుడుచుకుంటూ పడమటి ఇంటి వైపు బయలుదేరాడు.

"లేచాడండీ పోటుగాడు... పాత్రలన్నిటినీ తుడిచి పెట్టకుండా అవతలికి పోడు. మనుష్యులకైతే వండి వార్చటం తేలిక... బడి పశువులకి వండి పెట్టాలంటే వంద చేతులు కావాలి... నాకు వున్నవి రెండే...." సన్నగా వినవచ్చింది పడక గదిలో పట్టె మంచంమీద మందపాటి దుప్పటి కప్పుకుని పెద్దగా గురకలు తీస్తూ వుండవలసిన పిన్నమ్మ కంఠం.

చద్ది అంబలి గురించి మర్చిపోయి, తన బాణాకర్రను పట్టుకుని బయటికి వచ్చేశాడు అతను. మదనుడు వేసిన ప్రశ్నతో ఆ సంగతి గుర్తుకు వచ్చేసరికి మ్లానమైపోయింది అతని వదనం.

"బాధ పడకురా... పెద్దవాళ్లకు తిట్లు శాపనార్థాలు, చిన్నవాళ్లకి ఆశీర్వాదాలుగా మారిపోతాయని మీ అమ్మ అంటూ వుంటుంది" అంటూ వెనక్కి చూసి చిన్నగా నవ్వాడు మదనుడు.

"అడుగో... మా నాన్న.... చద్దిబువ్వ మూటని చంకన పెట్టుకుని పడుతూ లేస్తూ పరిగెత్తుకు వస్తున్నాడు... నువ్వు కొట్టిన దెబ్బలకి ఆ సూకరం అరిచిన అరుపులు గ్రామంలోకి కూడా వినిపించి వుంటాయి" అంటూ రుద్రుడి చేతిని వదిలిపెట్టకుండా తనతోపాటు తమ చేలోకి తీసుకుపోయాడు.

అతను చెప్పినట్లుగానే అదరాబాదరగా వచ్చాడు అతని తండ్రి. "పందుల గురకలు వినబడ్డాయి. మనిషిని చూస్తే తప్ప అవి అలా శబ్దం చేయవు. నువ్వు క్షేమమేనా?" అని తన పుత్రుడిని అడిగి "ఏరా రుద్రుడు... నువ్వేమైనా దుందుడుకుగా ఎగబడ్డావా? లేదుగా?" అని రుద్రుడిని అడిగాడు.

"అటువంటిదేమీ లేదు పెదనాన్నా. నేనేమీ ఎగబడలేదు" అంటూ కొట్టిపారేయటానికి చూశాడు రుద్రుడు.

మదనుడు మాత్రం వదలిపెట్టలేదు. జరిగినదంతా వివరంగా చెప్పాడు. "నిజంగా రుద్రుడు... నీ గుండే గుండెరా... మొనగాడివి నువ్వు...." అంటూ రుద్రుడిని మెచ్చుకున్నాడు అతని తండ్రి.

దగ్గిర కూర్చుని తను తీసుకువచ్చిన చద్దిబువ్వని అతనికి, తన కొడుక్కి పెట్టాడు ఆ తండ్రి.

"జాగ్రత్తగా వుండండి... పారిపోయినట్లే పారిపోయి ఆ దొంగ మొఖాలు ఇంకోసారి వెనక్కి రావచ్చు" అని జాగ్రత్తగా చెప్పి గ్రామంలోకి వెళ్ళిపోయాడు.

మిట్టమధ్యాహ్న సమయం వరకూ చేనుగట్టు మీదనే కాపలా నిలుచున్నాడు రుద్రుడు... మదనుడి తండ్రి వచ్చి అతన్ని ఇంటికి పంపటం చూశాడు. తన

కోసం తన బాబయ్య రాడని తెలుసు అతనికి. ఆకలితో కళ్ళు బైర్లు క్రమ్ముతున్నట్టు అనిపించినా ఓర్చుకుని, చీకటి పడుతున్న సమయంలో ఇంటికి చేరుకున్నాడు. గబ గబా వంట పాత్రను పట్టుకుంటుండగా తిట్టడం ప్రారంభించింది అతని పిన్నమ్మ.

ఆ ఇల్లు ఆమెది కాదు. అతని తల్లిదండ్రులది. రుద్రుడికి ఆరు సంవత్సరాల వయసున్నప్పుడు ఏదో అంటువ్యాధికి గురై కాలం చేశారు అతని తల్లిదండ్రులు ఇద్దరూ... గ్రామస్తులందరూ కూడ బలుక్కుని, ఎక్కడో ఏదో గ్రామంలో కూలిపనులు చేస్తూ కాలం గడుపుతున్న అతని బాబయ్యని, పిన్నమ్మని పిలిపించి, అతని బాధ్యతల్ని వాళ్ళకి అప్పగించారు.

"వయసు వచ్చేంతవరకూ సంరక్షించి. అతని ఇంటిని, పొలాన్ని అతనికి అప్పగించేయండి... అతను మిమ్మల్ని జీవితాంతం పోషిస్తాడు" అంటూ ఆ రోజున గ్రామపెద్దలు చెప్పిన మాటలకు తల ఊపి ఒప్పుకున్నది అతని పిన్నమ్మ. ఆ ఇంటిలో అడుగుపెట్టిన మరుసటి క్షణంలోనే తన ప్రతాపాన్ని ప్రదర్శించటం మొదలు పెట్టింది.

తనకు చెందవలసిన ఆస్తిపాస్తులను తాము స్వంతం చేసుకునేందుకే ఆమె అలా నోటికి వచ్చిన మాటలతో అవమానపరుస్తోందని తెలిసినా, తల వంచుకుంటూ వచ్చాడు రుద్రుడు.

"ఎందుకురా తల వంచుకోవటం? గ్రామ పెద్దలకు చెప్పి పరిష్కారం చూపించమందాం. చిన్నప్పుడు తిట్టిందంటే అర్థం వుంది. ఇప్పుడు కూడా ఆడిపోసుకోవటం అంటే తాను అసలు మనిషికాదని అర్థం...." అంతకు మూడు రోజులకు ముందే రుద్రుడితో అన్నాడు మదనుడు.

"పిన్ని మాటలు నిజంగానే నన్ను బాధిస్తున్నాయిరా... కాని మా బాబయ్య ముఖం చూసి భరించాల్సి వస్తోంది... ముసలివాడైపోయాడురా తను. ఇప్పుడు నేను గ్రామపెద్దల దగ్గిర గొడవ మొదలుపెడితే తను అన్యాయం అయిపోతాడు. అందుకే తల వంచుకుని భరిస్తున్నాను...." అని సమాధానం ఇచ్చాడు రుద్రుడు– అప్పుడు.

కాని ఇప్పుడు అలా ఓర్పు పట్టటం అనవసరం అనే మాట మనసులో మెదలటం మొదలుపెట్టింది. నీటితో నిండిన కనులను తన అంగీ భుజానికి తుడుచుకుంటూ వంట ఇంటిలో నుంచి ఇవతలికి వచ్చాడు.

"బయలుదేరావా? చీకటిపడిన తర్వాత వీధుల్లో తిరగటం పరువు మర్యాదలున్న మనుష్యులు చేయవలసిన పనేనా?" ఎత్తి పొడుపును వినిపించింది అతని పిన్నమ్మ.

వినబడనట్లు నటిస్తూ, ముఖద్వారం దగ్గిర గుమ్మానికి ఆనించి పెట్టిన కర్రను చేతుల్లోకి తీసుకున్నాడు రుద్రుడు.

"ఏరా రుద్రుడు. ఎక్కడికి రా ఈ చీకట్లో?" సన్నగా అతని చెవికి చేరింది ముఖద్వారం దగ్గిరే మట్టి అరుగు మీద కూర్చుని వున్న అతని బాబయ్య కంఠం.

తన జతగాడు మదనుడి దగ్గరికి పోయి, అతనితో కలిసి గ్రామ పెద్దల దగ్గరికి వెళ్ళాలనీ, తన గోడును వారందరికీ చెప్పుకోవాలని నిర్ణయించేసుకున్నాడు రుద్రుడు.

పైకి మాత్రం, "ఏమీలేదు బాబయ్య... అలా కాస్సేపు అటూ ఇటూ తిరిగి వస్తాను" అని మాత్రం అన్నాడు.

గుమ్మంలో నుంచి ఒకసారి లోపలికి తొంగి చూసి గొంతును బాగా తగ్గించాడు అతని బాబయ్యా. తన దుస్తుల్లో నుంచి మూడు రాగి నాణేలను తీసి ముందుకు జాచాడు.

"బాగా బలిసి కొవ్వుబట్టిన మన గొర్రె పొట్టేలును పది రాగినాణేలకు అమ్మేశాను. మీ పిన్నమ్మకి చెప్పలేదు. వాటిని తీసుకుని ముదిరాజమ్మ దగ్గర తీపి రొట్టెల్ని కొనుక్కుని తిను...." అన్నాడు.

గ్రామంలో వంటలు చేసుకోవటానికి ఎవరికైనా ఇబ్బందులు వస్తే, తగిన మూల్యం తీసుకుని తియ్య తియ్యగా వుండే జొన్నరొట్టెల్ని చేసి పెడుతుంది ముదిరాజమ్మ.

"పొట్టేలును అమ్మేసినట్టు పిన్నికి తెలియదా?" తన బాబయ్య ముందుకు జాచిన మూడు నాణేల వంక విచిత్రంగా చూస్తూ ఆశ్చర్యంగా అడిగాడు రుద్రుడు.

"ఎందుకు తెలియదు? బాగా తెలుసు? అసలు అలా అమ్మేయమని తనే నాకు చెప్పింది..." అన్నాడు బాబయ్య.

"మరి అమ్మగా వచ్చిన నాణేల్ని తను తీసుకోలేదా?" మరింత ఆశ్చర్యంగా అడిగాడు రుద్రుడు.

"ఎందుకు తీసుకోలేదు? తీసుకుంది. కాని నేను పొట్టేలుకు ఏడు నాణేలే వచ్చాయని చెప్పి వాటిని నా దగ్గిరే దాచేను" నవ్వుతూ చెప్పి రుద్రుడి చేతిలో అతి బలవంతంగా ఆ నాణేల్ని పెట్టాడు అతని బాబయ్య.

"ఇవాళ కాకపోయినా రేపయినా సరే అసలు విషయం ఆమెకి తెలిసిపోతుంది. ఇచ్చినందుకు నిన్ను, తీసుకున్నందుకు నన్ను ఏకులు వడికి నట్టు వడికి పారేస్తుంది" భయం భయంగా అన్నాడు రుద్రుడు.

"నిజం చెప్పాలంటే నిన్ను మేము పోషించటం లేదురా. నువ్వు మమ్మల్ని బతికిస్తున్నావు. నువ్వు లేకపోతే అడవి దగ్గిర ఆ పొలాన్ని సాగు చేయటం నాకు అసాధ్యం. ఆ రాక్షసి నిన్ను అంటున్న మాటలు నన్ను ఎంతగానో బాధ పెడుతున్నాయిరా... కాని ఏమీ చెయ్యలేని పరిస్థితి నాది...." తలవంచుకుంటూ అన్నాడు బాబయ్య.

మదనుడిని వెంటబెట్టుకుని గ్రామ పెద్దల దగ్గరికి పోవాలనే కోరిక అతి వేగంగా మాయం అయిపోయింది రుద్రుడి మనసులో నుంచి.

"బాధపడకు బాబయ్యా... పిన్ని నోరు పెద్దదనే మాటలో సందేహం ఏమీ లేదు. కాని ఏదో ఒక రోజు ఆమెలో మంచి మార్పు వస్తుందని ఆశిద్దాం... నువ్వు ఇవన్నీ మనసులో పెట్టుకుని నీ ఆరోగ్యం చెడ గొట్టుకోబోకు" అంటూ ఆయన ఇచ్చిన నాణేల్ని దట్టీలో దోపుకుని వీధిలోకి వెళ్ళిపోయాడు.

*　　　*　　　*　　　*　　　*

"నాకు తెలుసు... వీడు పెద్ద వీరాధివీరుడి మాదిరిగా బయలు దేరాడు. గ్రామపెద్దల దగ్గిర అనర్గళంగా తన బాధల్ని వివరించటానికి కంకణం కట్టుకుని మరీ గుమ్మం దాటాడు... వాడి బాబయ్య ఎదురుపడి కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు. వాడు మెత్తబడి జావ అయిపోయాడు" తమ ఇంటి ముందుకు వచ్చిన రుద్రుడిని దూరంలో వుండగానే గమనించి, తన తల్లిదండ్రులకు చెప్పాడు మదనుడు.

ఇంటి ముందున్న మట్టి అరుగుమీద తుంగచాపల్ని పరిచి, వాటి మీద కూర్చుని వున్నది ఆ కుటుంబం.

తళతళ మెరిసే సత్తుపళ్లెరాల్లో వెచ్చవెచ్చటి జొన్న రొట్టెల్ని పెట్టి నంజుడుకు ఏదో పచ్చడి కూడా పళ్ళెరంలో వేసి తండ్రి కొడుకులు ఇద్దరికీ అందిస్తోంది మదనుడి తల్లి.

"ఏరా రుద్రుడు... భోజనం అయిందా?" అడిగింది రుద్రుడిని చూడగానే.

"తల ఊపబోయిన రుద్రుడి కంటె ముందుగానే వాడు ఏమీ తినలేదు... నాకు తెలుసు... ఇంకో పళ్ళెరం పట్టుకురా...." అంటూ తల్లికి చెప్పి, పళ్ళేన్ని రుద్రుడి కేసి జూచాడు మదనుడు.

"నా దగ్గిర రాగి నాణేలున్నాయిరా... వెళ్ళి ముదిరాజమ్మ దగ్గిర రొట్టెలు తీసుకుంటాను...." అంటూ అభ్యంతరం వెలిబుచ్చబోయాడు రుద్రుడు.

"మూడు సంవత్సరాల క్రితం పురుగులు పట్టాయని అందరూ పశువులకోసం వదిలేసిన జొన్నల్ని దంచి రొట్టెలు చేస్తోంది ఆ ముదిరాజమ్మ. వాటిని తింటే ఎటువంటి రోగాలు వస్తాయో ఎవరూ చెప్పలేరు... బెట్టు చేయకుండా పెట్టింది తిను" కోపంగా అంటూ తన పళ్ళెరాన్ని అతి బలవంతంగా అతని చేతిలో పెట్టాడు మదనుడు.

తడి అయిన తన కనులు అతనికి కనిపించకుండా గబుక్కున తల వంచుకుని ఆ పళ్ళెరాన్ని వళ్ళో పెట్టుకున్నాడు రుద్రుడు.

లోపలికి పోయిన మదనుడి తల్లి మరో పళ్ళెరంలో రొట్టెలు పెట్టుకుని బయటికి వచ్చి, మదనుడికి ఇచ్చింది.

"చంపకపల్లి నగరంలో నీ జతగాడి మేనమామ మంచి వ్యాపారస్తుడిగా కుదురుకున్నాడు. ఒక్కటే కూతురు అతగాడికి. మదనుడికి ఇచ్చి పెళ్ళి చేద్దామని అనుకుంటున్నాము... నీకు కూడా వయసు వచ్చేసింది. మరి నీ సంగతేమిటి?" అని అడిగింది రుద్రుడిని.

"తా దూర సందులేదు మెడకో డోలు అన్నట్టున్నాయి నీ మాటలు..." తడుముకోకుండా అన్నాడు మదనుడు.

"అరేయ్ తప్పురా... నొచ్చుకుంటాయి మనసులు...." వెంటనే అతన్ని మందలించాడు అతని తండ్రి.

"నేను తప్పు ఏదీ మాట్లాడలేదు... రుద్రుడి ఆస్తి పాస్తులు అతనికి వచ్చేస్తేనే పెళ్ళి... గ్రామపెద్దల దగ్గిరికి పోకుండా ఆ పని జరగదు. పోవటానికి వాడు వప్పుకోడు. పెళ్ళి చేసుకుని పెళ్ళాన్ని ఎలా పోషిస్తాడు? తనతో పాటు ఆ నోటి దురుసు పిన్నమ్మ తిట్టే తిట్లతో కడుపు నింపుకోమంటారా" కోపంగా అడిగాడు మదనుడు.

"అవన్నీ వాళ్ళ సమస్యలురా... మనం కల్పించుకోకూడదు" సర్దటానికి మాట్లాడింది అతని తల్లి.

"రుద్రుడు నా జతగాడమ్మా... చిన్నప్పుడు ముదిరాజమ్మ కొడుకు నన్ను కొట్టి మోటబావిలో పడేస్తే ప్రాణాలకు తెగించి వాడు నన్ను బయటికి లాగాడు. నాకోసం ముదిరాజమ్మ కొడుకుని చితక్కొట్టి అవతలికి పంపించాడు. వీడికి

కష్టం వచ్చినప్పుడు నేను కల్పించుకోకపోతే స్నేహితుడిని ఎలా అవుతాను?" ఆవేశంగా అడిగాడు మదనుడు.

"ముదిరాజమ్మ కొడుకునేనా? గ్రామ పెద్ద చెల్లిలి కొడుకుని కూడా బాది బాది వదిలాడు. నిన్ను ఏదో అన్నందుకే. నాకు బాగా గుర్తు... ఎనిమిది రాగి నాణేలు అపరాధం నేను కట్టాను" నవ్వుతూ అన్నాడు తండ్రి.

"అవును కదా... అయితే బాగా వినండి... రుద్రుడి గొడవ ఒక దారికి వచ్చేంత వరకూ నేను పెళ్ళి చేసుకోను... అంతే" ఖచ్చితమైన కంఠంతో కొంచెం బిగ్గరగానే అన్నాడు మదనుడు.

"పిచ్చిపిచ్చి శపథాలు చేయబోకు... రుద్రుడి పిన్నమ్మ గురించి నీకు తెలియదు... అదో పెద్ద బండచ్చి... తన మాటలకి ఎవరైనా ఎదురు చెపితే బ్రహ్మరాక్షసి... మాదిరి విరుచుకు పడుతుంది. గ్రామ పెద్దలు కాదు గదా... మనల్ని పరిపాలించే మహారాజు వచ్చి వారించినా అది నోరు మూసుకోదు" కోపంగా అన్నది అతని తల్లి.

ఆమె మాదిరిగా ఆ విషయాన్ని ఖరాకండీగా తేల్చేయలేదు అతని తండ్రి. "ఆలోచిద్దాం... ఇవ్వాళ కాకపోయినా ఏదో ఒకరోజు ఈ సమస్యకు పరిష్కారం వెతకాల్సి వస్తుంది. అప్పుడు చూసుకుందాం" అంటూ చటుక్కున మాటల్ని ఆపాడు.

తలవంచుకుని తన పళ్ళెరంలోని రొట్టెల వంకే చూస్తున్న రుద్రుడు కూడా అదిరిపడి తల ఎత్తాడు.

నేల అదిరిపోయేటట్లు దాట్లు కొడుతున్న ఒక అశ్వం అతి వేగంగా అటుగా వస్తూ వుండడమే వారి కలవరపాటుకి కారణం.

"ఎవరు నువ్వు? ఏమయింది?? ఏమిటా దూకుడు? ఎవరి దగ్గరికి??" అరుగు మీది నుంచి లేచి గబగబా వారి మధ్యకు పోతూ పెద్దగా అడిగాడు మదనుడి తండ్రి – ఆ అశ్వంమీద మనిషిని.

"పారిపోండి అందరూ... పారిపోయి ప్రాణాలు దక్కించుకోండి... శృంగపర్వతాలకు అవతలి నుంచి శత్రువులు మన రాజ్యం మీదికి వచ్చేస్తున్నారు. మగవాళ్ళందర్నీ చంపి ఆడవాళ్ళను, పిల్లల్ని బానిసలుగా పట్టుకుంటున్నారు. ఇళ్లు వాకిళ్ళను తగలబెట్టి విధ్వంసం సృష్టిస్తున్నారు. రగడ గ్రామం నాశనమై

పోయింది.” గుక్కతిప్పుకోకుండా చెప్పి, అశ్వాన్ని గ్రామ పెద్ద ఇంటికేసి పరిగెత్తించాడు ఆ మనిషి.

తన చెవుల్ని తనే నమ్మలేనట్టు నిలబడిపోయాడు శిలా విగ్రహం మాదిరి మదనుడి తండ్రి.

రెండే రెండు నిముషాల్లో ఆ మనిషి మోసుకు వచ్చిన దుర్వార్త గ్రామపెద్దకి, ఇంకా అనేక మంది గ్రామస్తులకు తెలిసిపోయింది.

చీమ చిటుక్కుమన్నా పెద్దగా వినిపించేటంత నిశ్శబ్దంతో నిండి వున్న ఆ గ్రామం కాస్తా ఒక్కసారిగా రణగొణ ధ్వనులతో నిండిపోవడం మొదలైంది.

“మన రాజు సత్యవర్ధనుడికి శృంగ పర్వతాలకు అవతల వున్న వృశ్చికుడికి బద్ధ విరోధం... సందు చూసుకుని వాడు దండయాత్రకి వచ్చేశాడు...” సాలోచనగా అన్నాడు మదనుడు.

“సందు చూసుకోవటం ఏమిటి?” ఆశ్చర్యంగా అడిగాడు రుద్రుడు.

“సత్యవర్ధనుడి ఆరోగ్యం తిన్నగా లేదని అనుకుంటున్నారు. ఏదో వేటకు వెళ్ళి అశ్వం మీదినించి క్రింద పడి నడుములు విరగ గొట్టుకున్నాట్ట.”

“మరి రాజ్యపాలన ఎవరు చూస్తున్నట్టు?” అడిగాడు రుద్రుడు.

“బావమరిది మాంగళీకుడు....” అన్నాడు మదనుడు.

“మాంగళీకుడు వట్టి చవట... అధికార దర్పం ప్రదర్శించటమే తప్ప పరిపాలనా విషయాలు ఏవీ అతనికి తెలియవట...” పళ్ళు బిగించుతూ చెప్పాడు మదనుడి తండ్రి.

“మరి ఇప్పుడు మనం ఏం చేయాలి.” అని మదనుడు తండ్రిని అడగబోతూ వుండగానే, గ్రామ మధ్యంలో వున్న రచ్చబండ దగ్గిరి నుంచి కొమ్ముబూరల సవ్వడి వినిపించటం మొదలైంది.

గ్రామంలో ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినా, ముఖ్యమైన మాటల్ని గ్రామస్థులందరికీ తెలియ చేయవలసి వచ్చినా, పెద్దగా ఊదబడుతాయి రెండు కొమ్ముబూరలు.

నిద్రలకు ఉపక్రమించబోతున్న వారందరూ, వేగంగా రచ్చబండ దగ్గరికి పరుగులు తీశారు. అప్పటికే నిద్రలో మునిగిపోయిన వారు కళ్ళు నులుముకుంటూ వారిని అనుసరించారు.

పరుగులాంటి నడకతో వస్తున్న తన బాబయ్యను చూసి ఎదురు వెళ్ళ బోయిన రుద్రుడి చేతిని గట్టిగా పట్టుకుని ఆపేశాడు మదనుడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Rudrudu**

* * *